కాంగ్రెస్ సర్కారుపై అసహనం

- ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- అడుగడుగునా అనుభవ రాహిత్యం
- కీలక నిర్ణయాల్లో ప్రభుత్వం తడబాటు
- సొంత పార్టీ నేతల్లోనూ నైరాశ్యం

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసహనం వ్యక్తమవుతున్నది. ఆదరాబాదరాగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం.. ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరించడంపైనా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురికి పాలనా అనుభవం లేకపోవడం, కీలక నిర్ణయాల్లో సైతం తడబాటు వంటివి కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని స్వయంగా పార్టీలోనే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రుణమాఫీ వరకు పథకాల అమలులో సీఎం రేవంత్ అనుసరించిన తీరు కూడా విమర్శలకు కారణం అవుతున్నది. ఇటీవల ఒక సామాజిక వర్గంపై రేవంత్ అంతులేని ప్రశంసలు కురిపించడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తెలంగాణ సంస్కృతిని అవహేళన చేస్తూ ఒక సామాజికవర్గాన్ని కీర్తించటం తమకే నచ్చలేదని కాంగ్రెస్ నేతలే విమర్శిస్తున్నారు. శాఖల మధ్య, మంత్రులు, అధికారులకు మధ్య కొరవడిన సమన్వయ లోపంతో సాధారణ ప్రజానీకం ఇబ్బందులకు గురవుతున్నది. ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దటంతోపాటు పదేండ్లపాటు కేసీఆర్ తెలంగాణ ప్రతిష్ఠను పెంచటమే కాకుండా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యుడైన పాలకుడిగా పేరు తెచ్చుకున్నారని, ఈ క్రమంలో కేసీఆర్ మార్క్‌ను పాలనలో చూపాలంటే అంతకన్నా ఎక్కువ పరిణితితో వ్యవహరించాల్సిందిపోయి పేలవంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం నెలకొన్నది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం, మంత్రులు, ఆయా శాఖల అధికారుల మధ్య లోపించిన సమన్వయమే అందుకు నిదర్శనమని చెప్తున్నారు. సీఎంకు పాలనా పరమైన అనుభరాహిత్యం ఉన్నదనే విషయాన్ని గ్రహించిన అధికారులు క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులకు భిన్నమైన విషయాలను ప్రభుత్వానికి నివేదించటం వల్లే ఇటీవల తాము తీసుకున్న నిర్ణయాలు బెడసికొడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పటిష్ట కసరత్తు చేయకుండా ఆగమేఘాలపై రైతురుణమాఫీని రూ. 2 లక్షలకు బదులు రూ. లక్షతో ప్రారంభించటం రైతాంగంలో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. గ్రూప్ 2 పరీక్షను ఉద్యోగార్థులు కోరగానే వాయిదా వేస్తేపోయేదని, తరువాత వేసినా ఫలితం లేకుండాపోయిందని అంటున్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన, సంక్షేమ పథకాల విషయంలో సర్వే చేస్తున్నామని ప్రకటించి తీరా విమర్శలు వెల్లువెత్తడంతో ఆపేయాలని ఉత్తర్వులు ఇవ్వడం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వం తొలుత నిర్ణయం తీసుకుని తర్వాత వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేస్తున్నారు. దీంతో ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఒకటి వస్తుందని అనుకోలేదని వాపోతున్నారు.

బైక్‌పై రీల్స్ స్టంట్.. విద్యార్థి మృతి

హయత్‌నగర్, జూలై 21 : సోషల్ మీడియాలో రీల్స్ కోసం బైక్‌పై స్టంట్‌కు పాల్పడిన ఘటనలో ప్రమాదవశాత్తు కిందపడి ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాలు.. ఎల్బీనగర్‌లోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలో మేడ రాజు.. భార్య, కుమారుడు శివ(20), కుమార్తెతో కలిసి నివాసముంటున్నారు. శివ దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం శివ తన స్నేహితులు సంపత్, పవన్, విజయ్‌తో కలిసి బైక్‌లపై కుంట్లూరుకు బయల్దేరారు. శివ, సంపత్ కేటీఎం(టీఎస్07ఎఫ్‌క్యూ063)పై, పవన్, విజయ్ మరో(టీఎస్ 07జేయూ3042)బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యంలో శివ, సంపత్ తమ బైక్‌పై విజయవాడ జాతీయ రహదారిపై రీల్స్ కోసం స్టంట్లు చేస్తుండగా మరో బైక్‌పై ఉన్న పవన్, విజయ్ సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్నారు. సంపత్ బైక్ నడుపుతుండగా శివ వెనకాల కూర్చున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి ముందు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టి కిందపడిపోయారు. శివకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన సంపత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

మైటా నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : మలేషియా తెలంగాణ అసోసియేషన్(మైటా)నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా సైదం తిరుపతి, వైస్ ప్రెసిడెంట్‌గా చిరుత చిట్టిబాబు, మహిళా ప్రెసిడెంట్‌గా కిరణ్మయి, జనరల్ సెక్రటరీగా సందీప్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా సత్యనారాయణ రావు, ట్రెజరర్‌గా సందీప్‌కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా సుందర్‌రెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం తెనాలి వైద్యురాలు మృతి

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలికి చెందిన యువ వైద్యురాలు మృతి చెందారు. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక పశువైద్యురాలు. ఎంఎస్ చేయడానికి నిరుడు ఆగస్టులో అమెరికా వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్ఆర్ఐలతో సంప్రదింపులు జరిపారు.

అనుమానంతో భార్య, కూతురు హత్య

అనంతరం రైలు కిందపడి ఆత్మహత్య • అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు

మారేడ్‌పల్లి, జూలై 21: అనుమానంతో భార్య, కుమార్తెను హత్యచేసిన భర్త ఆ తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మహారాష్ట్ర బెగునూర్‌కు చెందిన గణేశ్(35), స్వప్న (30) దంపతులకు త్రివేణి, తనుశ్రీ, నక్షత్ర (11 నెలలు) సంతానం. మహారాష్ట్ర నుంచి మూడేండ్ల క్రితం న్యూబోయిన్‌పల్లిలోని పెద్దతోకట్టకు వచ్చి నివాసముంటున్నారు. గణేశ్ కూరగాయల ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నక్షత్ర జన్మించాక భార్యపై అనుమానంతో తరచూ గొడవలు జరిగేవి. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు గణేశ్ తన భార్య, కుమార్తె నక్షత్రను తాడుతో గొంతు నులిమి హత్యచేశాడు. అనంతరం డయల్ 100కు కాల్ చేసి .. భార్య, కుమార్తెను హత్య చేశానని, తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నానని సమాచారం అందించాడు. అప్రమత్తమైన బోయిన్‌పల్లి పోలీసులు అతడి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి స్వప్న, నక్షత్ర మృతి చెందిఉన్నారు. గణేశ్ సుచిత్ర సమీపంలో ఉదయం 6 గంటలకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అనాథలుగా మారిన చిన్నారులు త్రివేణి,తనుశ్రీ

ఆమనగల్‌లో పద్మనాయకుల రేఖాచిత్రాలు

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం రాంనూతుల శివారులోని అనంతగిరి గుట్టల్లోని గుహల్లో 14వ శతాబ్దం నాటి పద్మనాయకుల రేఖాచిత్రాలు (పెట్రోగ్లిఫ్స్) ఉన్నాయని చరిత్రకారుడు ద్యావనవల్లి సత్యనారాయణ తెలిపారు. ఆమనగల్ దగ్గర అయ్యసాగర్ వీరభద్రస్వామి ఆలయానికి సమీపంలోని బ్రహ్మదేవునిగుట్ట, విష్ణుదేవునిగుట్ట(అనంతగిరి)లను పరిశీలించినప్పుడు ఈ పెట్రోగ్లిఫ్స్ కనిపించినట్టు పేర్కొన్నారు. ఇవి ఉన్న గుహలకు స్థానిక గిరిజనులు సున్నం పూశారని, దీంతో చరిత్ర పూర్వయుగపు ఆదిమమానవులు వేసిన ఎరుపు రంగు బొమ్మలు కనుమరుగైనట్టు చెప్పారు. అనంతగిరి గుహల్లో ప్రస్తుతం మూడుచోట్ల పెట్రోగ్లిఫ్స్ కనిపిస్తున్నాయని, వాటిలో ప్రధాన గుహ, నైరుతి గుహ, గుండు పాదం ముఖ్యమైనవి అని వివరించారు. తూర్పునకు అభిముఖంగా ఉన్న పడగరాయి కింది గుహలో గుర్రం, వినాయకుల రేఖాచిత్రాలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థికి ప్రధాని మోదీ ప్రశంసలు

- ఐఎంవో-24లో స్కూల్ విద్యార్థి ఆదిత్యకు గోల్డ్ మెడల్
- ఆరుగురు విద్యార్థుల భారత్ బృందానికి నాలుగో ర్యాంక్
- హర్షం వ్యక్తం చేసిన శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం



ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య విద్యార్థులు

హైదరాబాద్, జూలై 21: విద్యారంగంలో అగ్రగామిగా నిలుస్తూ ఎందరో విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలు మరో మైలురాయిని అధిగమించాయి. ప్రపంచ వ్యాప్తంగా వేల మంది విద్యార్థులు పోటీపడిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్(ఐఎంవో)-2024లో భారత బృందం అద్భుతమైన ప్రతిభను చాటి ప్రపంచ వ్యాప్తంగా నాలుగో స్థానంలో నిలిచింది. దేశానికి చెందిన ఆరుగురు విద్యార్థుల బృందం ఐఎంవోలో నాలుగు బంగారు, రజత పతకం, గౌరవప్రదమైన ప్రస్తావనతో నాలుగో ర్యాంకులో నిలిచింది. ఈ బృందంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ బావదాన్ పూణేకు చెందిన విద్యార్థి ఆదిత్య మంగుడి ఉత్తమ ప్రతిభ కనబర్చడం విశేషం. ఇటీవల బాత్(యూకే)లో ముగిసిన 65వ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఈ ఘనత దక్కింది. ఈ చారిత్రక విజయాన్ని సాధించడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీచైతన్య విద్యార్థి ఆదిత్యతోపాటు ఇతర బృందాన్ని ప్రధాని మోదీ ఎక్స్(ట్విట్టర్)వేదికగా అభినందించారు. భారత్‌ను నాలుగో స్థానంలో నిలిపిన విద్యార్థుల బృందానికి శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్లు సుష్మ, సీమ అభినందనలు తెలిపారు. ఆదిత్య తమ స్కూల్‌లో 6వ తరగతి నుంచే చదువుతున్నాడని, ప్రస్తుతం 12 తరగతి చదువుతున్నాడని, ఐఎంవోలో బంగారు పతకం సాధించడం వెనుక అంకితభావం, కృషి ఉందని కొనియాడారు.

అత్తాపూర్‌లో రౌడీషీటర్ల పాగా

- కోట్ల రూపాయల స్థలం కబ్జాకు యత్నం
- తుపాకులు, కత్తులు, వేట కుక్కలతో పహరా
- 9మంది రౌడీషీటర్ల అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 21 (నమస్తే తెలంగాణ): ఖరీదైన స్థలం కనిపించిందంటే చాలు వారు గద్దల్లా వాలిపోతారు. అవసరమైతే ప్రాణాలు తీసైనా ఆ స్థలాన్ని లాగేసుకుంటారు. వారికి అండగా ఎలాంటి శక్తులున్నాయో తెలియదు కానీ, ఖాళీ స్థలాల్లో దర్జాగా తిష్టవేసి అడ్డొచ్చిన వారిని బెదిరించి, కాదంటే అడ్డు తొలగిస్తారు. కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని చేజిక్కించుకుంటారు. ఈ క్రమంలోనే రాజేంద్రనగర్ జోన్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్‌హిల్స్‌లో ఉన్న ఖాళీ స్థలంపై వారి కన్ను పడింది. కోట్ల రూపాయల విలువైన 500 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు పథకం పన్నారు. కొన్ని రోజుల క్రితం ఆ స్థలంలో తిష్టవేశారు. తుపాకి, కత్తులు వంటి మారణాయుధాలతోపాటు వేటకుక్కలను బోన్‌లో పెట్టి ఆ స్థలంలోకి ఎవరూ రాకుండా రాత్రింబవళ్లు పహారా కాస్తున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌వోటీ బృందం అక్కడకు చేరుకుని వారిని అరెస్ట్ చేసింది. 9 మంది రౌడీషీటర్లను అరెస్ట్ చేసి వారి నుంచి ఎయిర్ గన్, నాలుగు తల్వార్లు, కత్తులు, గొడ్డళ్లు, వేటకుక్కలతో కూడిన బోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను కబ్జా చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 16 నుంచి 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతున్నదని టీటీడీ అధికారులు తెలిపారు. శనివారం భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 4.25 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఆదివారం తిరుమల పెద్దజీయర్ నేతృత్వంలో చాతుర్మాస దీక్షా సంకల్పం నిర్వహించారు. ఆలయ మహద్వారం వద్ద టీటీడీ ఈవో జే శ్యామలారావు, జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలికారు. అన్నప్రసాదాలకు వాడే సరుకుల్లో లోపాలు గుర్తించినట్లు ఈవో తెలిపారు. తిరుమల లడ్డూ నాణ్యత లేకపోవడానికి అందులో వినియోగించే నెయ్యే కారణమని స్పష్టం చేశారు. వాటన్నింటినీ సరిదిద్ది ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో గుర్తించిన లోపాలను మీడియాకు వెల్లడించారు. వాటిని సరిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా వివరించారు. లడ్డూ తయారీలో వాడే ముడి సరుకుల పరీక్షకు తిరుమలలోనే ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఐ ముందుకొచ్చిందని తెలిపారు.

శాకంబరి దేవిగా శ్రీశైలం భ్రమరాంబ

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): అష్టాదశ శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శాకంబరి ఉత్సవాలను నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భ్రమరాంబ అమ్మవారి ఆలయాన్ని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. కూరగాయలు, వివిధ రకాల పండ్లతో భ్రమరాంబాదేవి మూలమూర్తితోపాటు ఉత్సవమూర్తి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారు, అన్నపూర్ణాదేవి, గ్రామదేవతైన అంకాలమ్మ అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు ఏఈవో జీ స్వాములు, పర్యవేక్షకులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.





ఆఖర్లో కాదు..

రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

మనలో ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలు చేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్న కొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునే వారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.

లోన్ పోర్టబులిటీ

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తాంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరికొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అంటారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం

ఇది ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..

1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

6. హెచ్ఆర్ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..

మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్లైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000-రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

9. వైద్య ఖర్చులకు..

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

10. విరాళాలు

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.



పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్లైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేముకదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానం